ఇంటి నుంచే ఓటు

- ఓట్ ఫ్రమ్ హోమ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం
- దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వారికి అవకాశం
- మొబైల్ వాహనం సాయంతో ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం

ఆదోని సెంట్రల్: ఓటు వేయాలంటే పోలింగ్ కేంద్రానికి వెళ్లక తప్పదు. ఓటు ప్రతిఒక్కరి హక్కు కనుక పోలింగ్ బూత్ వద్ద వరుసలో నిలబడి ఓటు వేయాల్సి ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయాలంటే ఇబ్బందులు తప్పవు. అందుకే కేంద్ర ఎన్నికల సంఘం 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉండి నడవలేని దివ్యాంగుల కోసం మొబైల్ వాహనాన్ని పంపి వారు ఇంటి వద్దనే ఓటు వేసేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. వీరికి పోస్టల్ బ్యాలెట్‌లను మంజూరు చేయనున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌ను చూపాల్సి ఉంటుంది. నామినేషన్ల పర్వానికి ముందే అర్హుల ఇంటివద్దకు అధికారులు వచ్చి దరఖాస్తులను అందజేస్తారు. దీంతో దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా చూడడంతో పాటు ఓటింగ్ శాతాన్ని పెంచేలా ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఎన్నికల సమయంలో కుటుంబ సభ్యులు దివ్యాంగులను, అనారోగ్యంతో ఉన్నవారిని ఎన్నికల బూత్ వద్దకు ఓటు వేసేందుకు మోసుకొని వస్తుంటారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్ ఏర్పాటు చేసినప్పటికి కొన్నిసార్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఓటు ఫ్రమ్ హోమ్ విధానంతో ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సజావుగా ఉపయోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫారం–12డీతో దరఖాస్తు చేసుకోవాలి

85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు ఇంటివద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బూత్ లెవెల్ అధికారి (బీఎల్‌ఓ)ని సంప్రదించి ఇంటి నుంచే ఓటు వేయడానికి దరఖాస్తు చేయాలి. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

- ఫారం–12డి ద్వారా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న బీఎల్‌ఓల ద్వారా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ)కు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన వారి జాబితాను ఈఆర్‌ఓ స్థాయిలో రూపొందిస్తారు.
- ఫారం–12డి ప్రకారం దరఖాస్తు చేసుకున్న ఓటరు ఏ రోజు ఓటు వేయాలో అధికారులు ముందుగానే సమాచారం అందిస్తారు.
- మొబైల్ ఓటింగ్ వాహనం ద్వారా ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని వారికి కల్పిస్తారు. బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ ప్రక్రియను అంతా వీడియో తీస్తారు.
- ఇంటి వద్దనే ఓటు వేసిన అనంతరం సీల్ చేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి పంపుతారు.

ఆదోని నియోజకవర్గం ఓటర్ల వివరాలు

ఆదోని నియోజకవర్గంలో మొత్తం 2,64,669 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,27,798, మహిళలు 1,29,682 మంది ఉన్నారు. అలాగే ట్రాన్స్‌జెండర్ 49 మంది, 80 ఏళ్లు పైబడినవారు 4683 మంది ఉన్నారు. దివ్యాంగులు 2337 మంది, ఎన్‌ఆర్‌ఐ 9 మంది, సర్వీస్ మ్యాన్‌లు 111 మంది ఉన్నారు. వీరిలో అర్హత ఉన్నావారు ఓట్ ఫ్రమ్ హోమ్‌కు దరఖాస్తు చేసుకుంటే వారికి ఇంటి వద్దనే ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పిస్తారు.



ప్రతీకాత్మక చిత్రం

వృద్ధులకు ఎంతో ఉపయోగం



నడవలేక చేతికర్రల సాయంతో గడుపుతున్న వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించడం ఎంతో ఉపయోగకరం. చాలామంది పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసే ఓపిక లేక ఓటుహక్కును వినియోగించుకోలేకపోతున్నారు. కొందరు ఓటు వేయకపోతే వచ్చే నష్టం ఏమీ లేదులే అంటూ నిర్లక్ష్యంతో ఓటు హక్కును ఉపయోగించుకోవడం లేదు. వృద్ధాప్యంలో కేంద్రాలకు వచ్చి ఓటు వేయలేని వారికి హోమ్ ఓటింగ్ పద్ధతి ఎంతో మేలు. – రామయ్య ఉపాధ్యాయుడు ఆదోని

మంచి నిర్ణయం



ఇంటి వద్ద నుంచే ఓటు వేసే విధంగా మొబైల్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావడం మంచి నిర్ణయం. వృద్ధులు, దివ్యాంగులను దృష్టిలో ఉంచుకొని వారు ఇబ్బంది పడకూడదని ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. ఈ నిర్ణయం వల్ల ఓటింగ్ శాతం పెరగడమే గాకుండా ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. – లోక్యానాయక్, ఉపాధ్యాయుడు, ఆదోని

క్లుప్తంగా

పశువుల నీటి కష్టాలు తీర్చండి

కౌతాళం: అధికారులు ఎల్‌ఎల్‌సీ కాలువకు ఫిబ్రవరిలో తుంగభద్ర డ్యాం నుంచి నీటిని విడుదల చేసి నెల రోజులు కావస్తున్నా చిన్న కాలువలకు మాత్రం నేటికీ వదలకపోవడంతో పశువులకు నీరులేక మూగజీవాలు అల్లాడుతున్నాయని సీపీఎం నాయకుడు మల్లయ్య అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఎల్‌సీ కాలువ ద్వారా ప్రజల దాహార్తిని తీర్చేందుకు గత నెలలో టీబీ డ్యాం అధికారులు నీటిని విడుదల చేశారని.. అయితే పశువులకు మాత్రం తాగేందుకు ఎక్కడా పిల్ల కాలువలకు నీరు వదలలేదని తెలిపారు. దీంతో పశువులకు నీరు లేక అల్లాడుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది వర్షభావ పరిస్థితుల వల్ల నీటికి కష్టంగా ఉందని.. ఎల్‌ఎల్‌సీ అధికారులు పశువులకు తాగునీటి కోసం పిల్ల కాలువలకు నీరు విడుదల చేయాలని కోరారు.

13 మంది బైండోవర్


తహసీల్దార్ ఎదుట హాజరైన పాత నేరస్తులు

పెద్దకడబూరు: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే అందరూ సహకరించాలని ఎస్‌ఐ మహేష్ కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని గవిగట్టు, జాలవాడి, నౌనేకల్లు, కల్లుకుంట, హులికన్వి గ్రామాల్లో 13 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ సురేష్‌బాబు ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో దొంగ ఓట్లకు పాల్పడినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో పాతనేరస్తులు, అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఒకసారి పోలీసుల రికార్డులో పేర్లు నమోదైతే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో పారా సేవా సమితి సభ్యులు రామచంద్ర ప్రసాద్, విశ్వనాథ్ కుటుంబసభ్యులు మంగళవారం 200 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ఏటా గ్రామంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. దాతల కుటుంబసభ్యులు జయవర్ధన్, సంధ్యారాణి, సమితి సభ్యులు వలి, పక్కీరప్ప, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుని హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో వెలసిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో సిబ్బంది, గ్రామస్తులు స్వామివారికి కానుకల రూపంలో వచ్చిన నగదును లెక్కించగా రూ.12.51 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. పర్యవేక్షణ అధికారి సుబ్బరాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరంగడు, మాజీ చైర్మన్ తలారి రాఘవేంద్ర, సిబ్బంది శ్రీనివాసులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

తుగ్గలి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈ నెల 18న రాతన వద్ద ఆటో అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లు మండలానికి చెందిన ఆంజనేయులు (24) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కేంద్ర బలగాల కవాతు

నందవరం: త్వరలో జగరబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని ఎస్‌ఐ తిమ్మయ్య కోరారు. మంగళవారం నందవరంతో పాటు ముగతి గ్రామంలోని గ్రామంలోని అన్ని వీధుల్లో కేంద్ర బలగాలతో కలిసి ఎస్‌ఐ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమసాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా సారించినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు, అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

నిర్భయంగా ఓటు వేయండి


కల్లూరు అర్బన్‌లో నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, పాణ్యం ఆర్వో/జేసీ మౌర్య

కర్నూలు: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. కర్నూలు మండలం ఎదురూరు గ్రామంలో మంగళవారం ఉదయం ఓటర్ల అవగాహన ర్యాలీ జరిగింది. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి కేంద్ర సాయుధ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఓటర్ల అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే స్థానిక పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా ఓటర్లను భయపెట్టినా, ప్రలోభపెట్టినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా, శాంతి భద్రతలను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో కవాతు...

ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు దేవనకొండ యూపీఎస్ సీఐ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెర్నేకల్లు, నేలతలమర్రి, గుండ్లకొండ గ్రామాల్లో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. అలాగే నందవరం ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ముగితి, నందవరం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు.

ఓటు..ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం

కల్లూరు: ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని, దీనిని ప్రతి ఓటరు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్‌లోన్ని ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఆటో స్టాండ్ వరకు నిర్వహించిన ఓటర్ల అవగాహన ర్యాలీలో ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్యతో కలిసి వారు పాల్గొన్నారు. ముజఫర్‌నగర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలోని 112, 113, 114, 115, 116, 117 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే కాక పోలింగ్ శాతం పెరిగేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, డీఎస్పీ విజయ శేఖర్, మెప్మా పీడీ నాగ శివలీల, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నాడు : ఆదోని మెయిన్‌రోడ్డు నుంచి రామస్వామి ఇంటి వరకు నేడు: సిమెంటు రోడ్డు ..


నాడు : కొత్త కాలనీకి వెళ్లే రోడ్డు


నేడు: డ్రైనేజీ, గ్రావెల్ రోడ్డు తర్వాత

సమస్యలకు పరిష్కారం

కౌతాళం: గ్రామాల్లో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సమస్యలకు పరిష్కారం దొరికింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధి వైపు పయనించాయి. ప్రతి పంచాయతీకి రూ. 40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులు చేశారు. మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో ప్రధాన రోడ్లన్ని సిమెంటు రోడ్లుగా మారాయి. అలాగే కొన్ని రోడ్లకు డ్రైనేజీలతో పాటు గ్రావెల్ రోడ్లు వేశారు. ఏళ్ల సమస్యకు పరిష్కారం కావడంతో ఎరిగేరి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గడప గడప నిధులతో పాటు పంచాయతీ గ్రాంట్స్‌తో గ్రామంలోని అన్ని రోడ్లను పూర్తి చేసినట్లు సర్పంచ్ గోవిందు తెలిపారు. గ్రామంలో రూ. 40 లక్షలతో 4 సిమెంటు రోడ్లు, ఐదు గ్రావెల్ రోడ్లను వేసినట్లు చెప్పారు.

విజేత పీఆర్ పల్లె వృషభాలు


లంకాయపల్లిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న బహుమతి దాతలు

తుగ్గలి: పెద్దమ్మవ్వ దేవత విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మంగళవారం లంకాయపల్లిలో నిర్వహించిన వృషభాల రాతిదూలం లాగుడు పోటీల్లో ప్యాపిలి మండలం పీఆర్‌పల్లె వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఊటకంటి అమరనాథ రెడ్డి, అశోక్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్ తదితరులు ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి మండల పీఆర్ పల్లె రంగనాయకులు వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో వడియంపేట లక్ష్మిరెడ్డి, మరుట్ల కృష్ణమూర్తి వృషభాలు (సంయుక్తంగా), మారెల్ల వడ్డె రమేష్ వృషభాలు, మల్యాల షేక్ మహబున్నీ వృషభాలు, ఆలంకొండ మునిరంగడు, పెద్దొడ్డి స్వామినాయుడు వృషభాలు, ఉంగరానిగుండ్ల, వెంకటేశ్వర్లు, ఆలంకొండ వినయ్‌యాదవ్ వృషభాలు నిలిచాయి. విజేతలైన వృషభాల యజమానులకు వరుసగా బహుమతి దాతలు అమరనాథరెడ్డి రూ.30 వేలు, సుల్తాన్ రూ.20 వేలు, ఎఫ్ఏ రమేష్, రామాంజినేయులు రూ.15 వేలు, లింగన్న రూ.10 వేలు, ఆదినారాయణ, చంద్రశేఖర్, శీను, భాస్కర్, రాము, అరవ శీను రూ.7,500, ఆటో శేఖర్ రూ.5 వేలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంత రెడ్డి, నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో అంతరాష్ట్ర ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలోని హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో గుంటూరు జిల్లా కాకనూరు మండలం, కొండవారిపాలెంకు చెందిన జీపీ చౌదరి వృషభాలు నిర్ణీత సమయానికి 3100 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలువగా రూ.50 వేలు నగదు బహుమతి ప్రదానం చేశారు. కర్నూలు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడు వృషభాలు 2900 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.40 వేలు దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా కొండవారి పాలెం జీపీ చౌదరి రెండో జత 2400 అడుగులు లాగి మూడో బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా, చాగంటి నాగేశ్వరరావు (సీఎస్‌ఆర్) వృషభాలు 2,325 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.20 వేలు, కర్నూలు మండలం రుద్రవరం ఎల్లగౌడు వృషభాలు ఐదో బహుమతి రూ.10 వేలు, కన్నమడకల చాకలి ఈశ్వరయ్య వృషభాలు ఆరో బహుమతి గా రూ.4 వేలు గెలుచుకున్నట్లు సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, అబ్దుల్ రహీమ్, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, సర్పంచు కేపీ వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


మద్దిలింగదహళ్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. ఆయన మంగళవారం మద్దిలింగదహళ్లి, పెద్ద గోనెహాళ్ గ్రామాలలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. కక్షలు, కార్పణ్యాలకు పోకుండా గ్రామం అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే పెద్దల సమక్షంలో పరిష్కరించుకుని ప్రశాంత వాతావరణం ఏర్పడేలా చూడాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలని, కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని మన్నెకుంట, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో మంగళవారం రాత్రి ఆయన గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. ఎన్నికల వేళ ఎవరైనా అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అలాగే రహదారి ప్రమాదాలు, బాలిక చట్టాలపై అవగాహన కల్పించారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్షుడిగా సుందర్‌సింగ్, ప్రస్తుత అధ్యక్షురాలు అనితాభాయి పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్షుడిగా తాయన్న, జనార్ధన్ పోటీలో ఉండగా, జనరల్ సెక్రటరీగా లోకేష్‌కుమార్, సురేంద్రకుమార్ బరిలో ఉన్నారు. కోశాధికారిగా మహ్మద్ లతీఫ్, అబ్దుల్‌అన్సారీ పోటీలో ఉన్నారు. ఇప్పటికే జాయింట్ సెక్రటరీగా ఎస్.వి. మల్లికార్జున, స్పోర్ట్స్ సెక్రటరీగా ఖలందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, రామలింగ తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, అనంతరం కౌంటింగ్ జరుగుతుందన్నారు. న్యాయవాదులు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు కోరారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆలూరు రూరల్: సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు హత్తిబెళగల్ గ్రామ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత ఫిబ్రవరిలో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మానస, నూర్జహాన్ ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వారు బుధవారం కర్ణాటక రాష్ట్రం దావణగేరిలో జరిగే జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆ విద్యార్థినులను గ్రామస్తులు, పీఈటీ చిన్నబాబు అభినందించారు.

బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు పరిశీలన


ఎస్‌ఎస్ ట్యాంకులో నీటి నిల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎంఈ, ఏఈలు

ఆదోనిటౌన్: ఆదోని పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకును మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంఈ చలపతిరావు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఎస్ఎస్ ట్యాంకులో నీటిమట్టం, తుంగభద్ర దిగువ కాలువ నుంచి రా వాటర్ పంపింగ్‌ను వారు పరిశీలించారు. కెనాల్‌లో నీటి సరఫరా బంద్ అయ్యేలోగా ఎస్ఎస్ ట్యాంకును పూర్తిస్థాయిలో నీటితో నింపుకోవాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంఈ, ఏఈలను ఆదేశించారు. పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాగునీటి వృథా, పైపులైన్ల లీకేజీలను సకాలంలో నివారించాలన్నారు. నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆవుదొడ్డి వంక, ఎర్రవంక వాగులోని పూడికతీత పనులను పరిశీలించారు. కపర్తి నగర్‌లో పూడికతీత పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మండిగిరి ఎర్రవంక వాగులో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం


జుమ్మాలదిన్నెలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కోసిగి: మంత్రాలయంలో మరోసారి బాలనాగిరెడ్డిని ఆశీర్వదించాలని.. ఆయన విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం కోసిగి రేణుక ఎల్లమ్మను ఆయన దర్శించుకున్నారు. అనంతరం జుమ్మాలదిన్నె, గొడుగల్లు, వందగల్లు, నేలకోసిగి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలను వివరించారు. సంక్షేమ పాలన కొనగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, నాయకులు నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, హొలగుంద కోసిగయ్య, బుళ్లి నరసింహులు, మల్లికార్జున గౌడ, గొడుగల్లు సర్పంచ్ శివమ్మ, ఐరన్‌గల్లు సర్పంచ్ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


కోసిగి సెబ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న నాగమద్దయ్య

కోసిగి: మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు . మంగళవారం కోసిగి సెబ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, కోసిగి సెబ్ సీఐ మహబూబ్ బాషాతో కలిసి సెబ్ సిబ్బందితో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. నాన్ డ్యూటీ పైడ్ మద్యం, సారా, బెల్టు షాపులపై విస్తృత దాడులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ మద్యం సరఫరా అయ్యే రూట్‌లలో ప్రత్యేక బృందంతో రోజు రూట్ వాచ్ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు సిబ్బంది అలసత్వం వహించకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. కర్నూలు సెబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సానాయుడు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి


నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై గతంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా రంగురంగుల బ్రోచర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునే విధంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు మల్లికార్జున, నరేష్, రసూల్, ప్రేమ్, సునీల్, రవి, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై శ్రీరంగనాథుడు


గజేంద్రునిపై కొలువుదీరిన శ్రీవారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గజోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకీ సేవ చేపట్టారు. రాత్రి శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజేంద్రుడిపై అధిష్టించారు. గజేంద్రుడు తన వీపుపై స్వామివారిని మోస్తూ భక్తులకు కనువిందు చేశారు. గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

పెరవలి గ్రామంలో బుధవారం ఉదయం శ్రీవారు, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం, సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు.